నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 3 జూన్ 2024 | HYDERABAD



బాచుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సాయినగర్, ఇంద్రానగర్, ప్రగతినగర్‌లోని జీపీఆర్ లేఅవుట్ కాలనీల వాసులు

## కాంగ్రెస్ చీకట్లపై..
# జనాగ్రహం

**అర్ధరాత్రి నగరంలో చీకట్లు**

**గంటల తరబడి విద్యుత్ అంతరాయం**

**అంధకారం, ఉక్కపోత..**

**గ్రేటర్‌లో నిత్యకృత్యంగా మారిన కరెంటు కోతలు**

**తట్టుకోలేక సబ్ స్టేషన్ల ముట్టడి**

సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో అర్ధరాత్రి అంధకారం అలుముకుంటున్నది. అసలే మండే ఎండలతో పగలంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర వాసులు.. అర్ధరాత్రి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోత తట్టుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలనీల వాసులంతా ఒక్కసారిగా ఇండ్లనుంచి బయటకు వచ్చి.. అర్ధరాత్రి అసహనంతో ఏకంగా విద్యుత్ సబ్ స్టేషన్లకు వెళ్లి ఆందోళనలు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.



సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

### రాత్రి 10:30 నుంచి 3గంటల పాటు..

బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ల పరిధిలో శుక్రవారం రాత్రి 10:30 నుంచి సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తీవ్ర అసహనానికి గురైన సాయినగర్, ఇంద్రానగర్, ప్రగతినగర్‌లోని జీపీఆర్ లేఅవుట్ కాలనీలకు చెందిన ప్రజలు అర్ధరాత్రి సబ్‌స్టేషన్ ముందు బైఠాయించారు. విద్యుత్ అధికారులకు, ఏఈకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏఈ డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కరెంటు కోతలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి కరెంటు పోవడంతో ఉక్కపోతతో నిద్ర పట్టడం లేదని వాపోయారు. చివరకు రాత్రి 1:30గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ఆందోళన సద్దుమనిగింది.

### రాజేంద్రనగర్ సర్కిల్‌లోనూ..

నగర శివారు ప్రాంతమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి 11గంటల సమయంలో సుమారు గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లోడ్ పెరిగిపోవడంతో కాయిల్ పేలిపోయి అంతరాయం కలిగిందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగదారులు మాత్రం అర్ధరాత్రి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఏమిటని మండిపడుతున్నారు. చాలా మంది ఆన్‌లైన్ వేదికగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలా ఒకటి, రెండు చోట్ల మాత్రమే కాదు గ్రేటర్ వ్యాప్తంగా 9 సర్కిళ్ల పరిధిలో ప్రతి రోజు పగటి వేళల్లోనే కాకుండా రాత్రి వేళల్లోనూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు.

### మరమ్మతుల పేరిట..4 గంటలు కోత

విద్యుత్ శాఖలో నిర్వహణ, మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరాను ఉదయం 2 గంటలు, మధ్యాహ్నం 2 గంటలు నిలిపి వేస్తున్నారు. అసలే వేసవి కాలం కావడంతో పగటి పూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్ణీత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేసి చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర పనులు చేపడుతున్నారు. అయితే పొద్దంతా కరెంటు లేక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు.., రాత్రి సమయంలోనూ కరెంటు కోతలు విధించడంతో కంటిమీద కునుకులేకుండా పోతుందని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొంటున్నారు.

**తెలంగాణ భవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్**



## సంక్షేమమే.. నీ సంకల్పం

*తెలంగాణ భవన్‌లో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య సరస్వతి చేతులమీదుగా ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి ఫొటోలన్నింటినీ తిలకించారు. తెలంగాణ ఉద్యమం, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.*




## బాగ్ అంబర్‌పేటలో..
## 4 నెలలుగా మురుగు నీటి సరఫరా

అంబర్‌పేట, జూన్ 2 : బాగ్ అంబర్‌పేట డివిజన్, స్ట్రీట్ నంబర్-15 అంటే స్థానిక ప్రభుత్వ పట్టణ ప్రాథమిక దవాఖానకు ఎదురుగా ఉన్న గల్లీలో గత నాలుగు నెలలుగా నల్లా నీరు కలుషితమై వస్తున్నాయి. వీటినే వినియోగిస్తున్న బస్తీ వాసులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత వాటర్‌వర్క్స్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా.. శాశ్వత పరిష్కారం చూపడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

# ఓఆర్ఆర్‌పై.. టోల్ చార్జీలు పెంపు

**నేటి నుంచే అమల్లోకి..**

సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డుపై టోల్ చార్జీలు పెరుగనున్నాయి. కొత్త వార్షిక సంవత్సరమైన ఏప్రిల్ 1-2024 నుంచి మార్చి 31, 2025 వరకు అమల్లో ఉండేలా ధరలను పెంచాల్సి ఉన్నా, దేశ వ్యాప్తంగా ఎన్నికలు ఉండడంతో టోల్ చార్జీలను పెంచలేదు. ఎన్నికల ప్రక్రియ జూన్ 1న ముగియడంతో 3వ తేదీ నుంచే టోల్ చార్జీలను పెంచుతున్నామని ఓఆర్ఆర్ నిర్వహణ సంస్థ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆదివారం ప్రకటించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతియేటా పెంచే టోల్ చార్జీల నిబంధనల మేరకు ఓఆర్ఆర్‌పై కొత్త టోల్ చార్జీలు అమలు చేయనున్నారు. నగరం చుట్టూ 158 కి.మీ పొడవునా ఉన్న ఓఆర్ఆర్‌పై 22 చోట్ల ఇంటర్‌చేంజ్‌లు ఉన్నాయి.

**ఓఆర్ఆర్‌పై కొత్త టోల్ చార్జీలు ఇలా..**


| వాహనాల కేటగిరీ | కి.మీ.. రూ. |
|---|---|
| కార్, జీప్, వ్యాన్, ఎల్ఎంవీ, ఎస్‌యూవీ, ఎంపీవీ | 2.34 |
| ఎల్‌సీవీ/మినీ బస్ | 3.77 |
| బస్/2-యాక్సిల్ ట్రక్ | 6.69 |
| 3యాక్సిల్ కమర్షియల్ వెహికిల్ | 8.63 |
| హెవీ కన్‌స్ట్రక్షన్ మెషినరీ/ ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్/ 4,5,6 యాక్సిల్ ట్రక్స్ | 12.40 |
| ఓవర్ సైజ్డ్ వెహికిల్స్ (7 యాక్సిల్ అంతకంటే ఎక్కువ) | 15.09 |

# జీడిమెట్లలో గాలివాన బీభత్సం

**విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు**

**గంటల తరబడి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా**

**మరో రెండు రోజులు గ్రేటర్‌కు వర్ష సూచన**



సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం సాయంత్రం గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. నగరానికి ఉత్తరం దిక్కున ఉన్న జీడిమెట్ల, చింతల్, గాజులరామారం, షాపూర్‌నగర్‌లో అత్యధికంగా వర్షం కురిసింది. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఫస్ట్‌అవెన్యూ కాలనీలో చెట్లతో పాటు విద్యుత్ స్తంభం విరిగిపడింది. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పేట్ బషీరాబాద్ విద్యుత్ అధికారులతో పాటు కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులకు ఫోన్లు చేసినా సకాలంలో స్పందించడం లేదని కాలనీవాసులు మండిపడ్డారు. అర గంట పాటు కురిసిన గాలివాన బీభత్సానికి ఆయా ప్రాంతాల్లోని కాలనీలలో పార్కింగ్ చేసి ఉంచిన వాహనాలపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. రాత్రి 9గంటల వరకు జీడిమెట్లలో అత్యధికంగా 4.48 సెం.మీలు, గాయత్రి నగర్, గాజులరామారంలో 3.0 సెం.మీలు, మోండామార్కెట్, కూకట్‌పల్లి రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో 2.30సెం.మీలు, సీతాఫల్‌మండి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో 1.7 సెం.మీలు, ముషీరాబాద్, పాటిగడ్డ, పికెట్ ప్రాంతాల్లో 1.5 సెం.మీలు, ఉప్పల్, చిలుకానగర్ ప్రాంతాల్లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీచేశారు.



రాయదుర్గం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసుల స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్, చిత్రంలో అడిషనల్ డీసీపీ జయరాం

## జయ జయహే.. తెలంగాణ..!



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన సంబురాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా కళాకారులు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు తెలిపేలా ఆటపాటలతో అలరించారు. ట్రైనీ పోలీసులు త్రివర్ణ పతాకాలను చేతబట్టి కవాతు నిర్వహించారు.

# మాదాపూర్‌లో బైక్ రేసింగ్

**50 మంది అరెస్టు.. 50 వాహనాలు సీజ్**

**రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

శేరిలింగంపల్లి, జూన్ 2 : మితిమీరిన వేగంతో దూసుకుపోతూ.. రహదారులపై ప్రమాదభరితంగా స్టంట్స్ చేస్తూ.. తోటి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ.. బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న వారిపై సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఐటీ కారిడార్‌లోని టీ హబ్ పరిసర ప్రాంతాల్లో రాత్రిళ్లు ఈ తరహా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న 50 మంది యువకులను అదుపులోకి తీసుకొని సదరు వాహనాలను సీజ్ చేశారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

### మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపిన వివరాల ప్రకారం..

రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాదాపూర్ టీ హబ్, ఐటీసీ కోహినూర్, నాలెడ్జి పార్క్, సత్వ బిల్డింగ్, మైహోం భుజా ప్రాంతాల్లోని రహదారులపై రాత్రిళ్లు ముఖ్యంగా వారంతంలో యువకులు బైక్ రైసింగ్‌లకు పాల్పడుతున్నట్లు సైబరాబాద్ పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీల అదేశాల మేరకు శనివారం రాత్రి పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న 50 మంది యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 50 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని 336, 341, 184 మోటర్ వెహికల్ యాక్టు కింద కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. ఒక్కో బైక్ రూ.80,000 నుంచి దాదాపు 6 లక్షల వరకు ఖరీదు చేసే స్పోర్ట్స్ వాహనాలు ఉన్నట్లు తెలిపారు.

### గతంలోనూ కేసులు నమోదు

రహదారులపై ప్రమాదభరితంగా విన్యాసాలు చేస్తూ రేసింగ్‌లకు పాల్పడుతున్న వారిపై గతంలోనూ కేసులు నమోదు చేసి యువకులకు కౌన్సెలింగ్ సైతం ఇచ్చినట్లు డీసీపీ తెలిపారు. సరైన డాక్యుమెంట్లు, వాహనాలకు నంబరు ప్లేట్లు లేకుండా, రిజిస్ట్రేషన్లు లేకుండా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువకులు ఈతరహా బైక్ రేసింగ్‌లకు పాల్పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. సమావేశంలో మాదాపూర్ అడిషన్ డీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.